# జ్యోతిష్యం - కర్మసిద్ధాంతం

ఎవరైనా... పరిహార ప్రక్రియలు పాటిస్తే... జీవితంలో ఒడిదుడుకులను ఎదుర్కొనే శక్తి పొందగలరు. అందుచేత జయం, దానం, హోమం, శాంతి, దేవాలయ దర్శన, రత్నధారణ, మొ॥ విషయాలు జ్యోతిష్యంలో చెప్పబడ్డాయి. ఇవి చేయటానికి ముందు మరికొన్ని విషయాలు తెలుసుకొని అప్పుడు పాటిస్తే మరింత ఫలితం ఉంటుంది.

'భా' అంటే కాంతి, కాంతి విజ్ఞానానికి, ఆనందానికి, పరమాత్మకు సంకేతం. దాని యందు 'రతి' (వీలు) గలవారే భారతీయులు. కర్మ సిద్ధాంతం అంటే (ఈ జన్మలో కాని, పూర్వ జన్మలో కాని తాను చేసిన పనికి ఫలితం తానే అనుభవించాలి అని కొందరి భావన. కాని చేసిన కర్మకు ప్రతిఫలం అనుభవించుట సార్వత్రికంగా నియమం కాదు. అప్పుచేసిన వాడు తీర్చకపోతే జైలుకు పోవుట కర్మ ఫలితంగా భావిస్తే... 'తీర్చుట' అనే ప్రక్రియ జైలుకు పోకుండా కాపాడుతుంది. అనగా పూర్వం చేసిన కర్మకు అనుభవించుటం ఒక మార్గమైతే... దానిని నిరోధించుట కొరకు మరో కర్మ చేయుట మరో మార్గం. కాగా జాతకం లో ఉన్నది తప్పక అనుభవించాలి. అనే విధానం మాత్రం సరియైనది కాదు. బృహజ్జాతక వ్యాఖ్యాత భట్టత్పలుడు 'జాతక ఫలితాన్ని అనుభవించుటే తప్పనిసరి అయితే దానిని తెలుసుకొనుట వ్యర్థం. భావి ఫలితాన్ని ముందుగా తెలుసుకొట వల్ల రాబోయే దుఃఖం కోసం ఇప్పటినుండి దుఃఖించడం అనే నష్టాలుండటం వల్ల జాతక ఫలితం తెలుసుకోవడమే నష్టప్రదం అవుతుంది. శాస్త్ర ప్రయోజనం అదికాదు. ఒక జాతకంలో శుభ ఫలితాన్ని తెలుసుకొని అనువైన కృషి చేయటం ద్వారా ఫలితాన్ని సంపూర్ణంగా సాధించవచ్చు.

జాతకంలోని దుష్ట ఫలితాన్ని విశ్లేషించి దానాదికములైన పుణ్యకర్మల ద్వారా శుభఫలితాన్ని పెంచుకోవచ్చు. దుష్టఫలితాన్ని ముందుగా తెలుసికొనుట ద్వారా దానికి వ్యతిరేకదిశలో ప్రయత్నించి దుష్ట ఫలితాన్ని జయించవచ్చు లేదా తగ్గించుకోవచ్చు. ఆ దోష ప్రాబల్య శాతాన్ని గమనించి దాన్ని జయించడం సాధ్యం కాని పక్షంలో దానికి సిద్ధపడి తన జీవనగమనంలో అనుగుణమైన మార్పులను చేసుకోవచ్చు' అని వివరించాడు.

కర్మ ఫలితం వుంటుంది. అది దుష్టమైనదైనపుడు దాని నివారణకు చేసే కర్మకూ ఫలితం ఉంటుంది. కర్మను కర్మచేతనే జయించాలి. పూర్వం చే సిన కర్మను దానివల్ల వచ్చే ఫలితాన్ని అదృష్టమని, దైవికమని పిలుస్తుంటారు. 'విహన్యాద్దుర్బలం దైవం పురుషేణ విపశ్చితా' అనే వ్యాసుని వచనం పూర్వకర్మను ప్రస్తుత కర్మచే జయించవచ్చునే అభిప్రాయాన్ని బలపరుస్తున్నది.

మనమిదివరలో చేసిన కర్మననుసరించి మన జననం సంభవిస్తుంది. మన జననం మన చేతిలో లేదు, కాని అప్పటి గ్రహస్థితి పూర్వకర్మకు అనుగుణంగా ఉంటుంది. ఆ గ్రహస్థితి ప్రభావం కాలక్రమంలో దశాక్రమాన్ననుసరించి ఆయా భావనలు ప్రేరేపిస్తుంది. ప్రేరేపించబడిన భావనకు స్పందించిన వ్యక్తి తన భావాలను అనుసరించి ప్రవర్తించ కుండా శాస్త్రం, సామాజిక న్యాయం, అనుభవం ఆధారంగా చేసుకొని వివేకంతో ప్రవర్తించి మంచిన పెంచుకోవడం, చెడ్డను తొలగించుకోవడం, చేయవలసి వుంటుంది. దోషఫలితం సిద్ధించే సమయాన్ని జాతకం తెలుపుతుంది. దానిని ముందుగా గుర్తించడం ద్వారా దానిని జయించే అవకాశాన్ని జాతకం కల్పిస్తుంది. అఘుజాతకంలో 'యదుపచిత మన్య జన్మని శుభశుభం తస్య కర్మణః పంక్తిం వ్యం జయతి శాస్త్రకులత్ తమసి దైవ్య ణి దీపమేవ' అన్నారు వరాహమిహిరుడు. పూర్వజన్మలో చేసిన శుభాశుభ కర్మల యొక్క ఫలానుభవ కాలాలను ఈ శాస్త్రం సూచిస్తుంది. చీకటిలోని వస్తువులను దీపం సహాయం తో గుర్తించినట్లుగా కలుగబోయే శుభాశుభాలను జాతకం ద్వారా గుర్తించి అనుకూల, వ్యతిరేక ప్రక్రియల ద్వారా జీవితాన్ని సుఖవంతం చేసుకొనుటకు ఈ శాస్త్రం సహకరిస్తుంది. కర్మ 3 విధులు. ప్రారబ్ధం, సంచితం, ఆగామి. ప్రారంబ్ధం అంటే – పూర్వజన్మలో మనం చేసిన కర్మల ఫలితం అనుభవించడం ప్రారంభించింది. ప్ర – ఆరబ్ధం – ఇంతకు ముందే ఆరంభింపబడింది. దానిని జయించ శక్యం కాదు. విడిచిపెట్టిన బాణం యొక్క మార్గాన్ని మళ్ళించ డం అంత సులభం కాదు. సంచితం– సంచితకర్మ అంటే పూర్వం చేయబడిన నిల్వవున్నది. ఆగామి – అంటే రాబోయే కాలంలో పరిపక్వమయ్యేది. మన సత్ప్రవర్తన ద్వారా ఆ గామిని మంచిగా మలచుకోవచ్చు. జాతకం ద్వారా రాబోయే దుష్టఫలితానికి వ్యతిరేకంగా మనం చెయ్యాల్సిన కృషిని అం చనా వేసుకొని ఆధ్యాత్మిక లౌకిక ప్రయత్నాల ద్వారా కృషి చేసి దుష్టఫలితాన్ని అధిగమించవచ్చు. ఉదాహరణకి... నిన్న ఒక వ్యక్తిని మనం కొట్టాం. ఈ రోజు అతను మనల్ని కొట్టడానికి పదిమందిని వెంటవేసు కొనివస్తున్నాడు. ఈ విషయాన్ని ముందుగా తెలుసుకొని మనం అతని చేతిలో దెబ్బలు తినటం తప్పనిసరి అని తెలిస్తే మూడు విధాలుగా దానిని అధిగమించవచ్చు.

ఎ) అతను ఎన్నింటికి వస్తున్నాడో తెలుసుకొని అతను వచ్చే సమయానికి ముందే అతనితో వచ్చే బలగం కన్నా ఎక్కువ బలగంతో వెళ్ళి 'క్షమార్పణ' చెప్పడం ఒక మార్గం. జాతకంలో ఉన్న దుష్టఫలితం యొక్క శాతాన్ని గమనించి దానాదుల ద్వారా దానికన్నా ఎక్కువ పుణ్యాన్ని సంపాదించి గతంలో తాను చేసిన అపరాధాలను క్షమించమని ప్రార్థించేటువంటి ఇది.

బి) ఎదుటివాడు 10 మందితో వస్తే అతన్ని జయించే విధంగా ఇంకా ఎక్కువ బలగంతో వెళ్ళి ఎదురించడం రెండో మార్గం... జాతకంలో దుష్ట సమయాన్ని గుర్తించి లౌకికమైన కృషిని పెంచి దుష్టఫలితాన్ని అధిగమించే ప్రయత్నం చేయడం ఇలాంటిదే.

సి) అతను వచ్చేసమయానికి అతనికి కనిపించకుండా దాక్కోవడం. మనకు జాతకంలో వచ్చే దుష్టసమయాన్ని గుర్తించి నూతన ప్రయత్నాలు చేయాలి.

- డా. ఈదుపుగంటి పద్మజారాణి
జ్యోతిష్య వాస్తు పండితురాలు

మీ సందేహాలని క్లుప్తంగా (మనిషికి 1 ప్రశ్న మాత్రమే) ఈ క్రింది వివరాలు వ్రాసి పంపండి. (పుట్టిన తేదీ వివరాలు లేనివారు 108 లోగా ఒక సంఖ్య వ్రాసి పంపండి. ఇది ప్రశ్న పద్ధతి, మనిషికి ఒక్క ప్రశ్న మాత్రమే)

పేరు : ..............................  పుట్టిన తేదీ : ..............................

పుట్టిన సమయం : ......................  పుట్టిన ఊరు (మండలం) : ..............

ప్రశ్న : ..............................

పై వివరాలతో కూడిన లెటర్‌ను ఈ క్రింది అడ్రస్‌కు పంపండి...

'జాతకం' 'సూర్య' ఆదివారం

సూర్యసౌధ, ప్లాట్ నెం: 22, రోడ్ నెంబర్: 5, జూబ్లీహిల్స్, హైదరాబాద్-33,
ఫ్యాక్స్: 040 2360 0024 sunday@suryaa.com